నిత్య వెలుగులు



ఇందిరాగాంధీ విగ్రహం క్రాస్ రోడ్డు వద్ద వెలుగుతున్న లైట్లు..

జగద్గిరిగుట్ట: జగద్గిరి గుట్ట బస్టాప్ సమీపంలో జంక్షన్ వద్ద లైట్లు పగలు, రాత్రి అనే తేడా లేకుండా వెలుగుతూనే ఉన్నాయి. గత కొన్ని రోజులుగా ఎవరూ పట్టించుకోవడం లేదని, ఈ విషయమై పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎటువంటి అధికారుల నుండి ఎటువంటి స్పందన లేదని స్థానికులు పేర్కొన్నారు.

సత్కారం



సిరిసిల్ల రాజయ్యను సత్కరిస్తున్న నర్సారెడ్డి భూపతిరెడ్డి..

దుండిగల్: తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా ఎన్నికైన సిరిసిల్ల రాజయ్య ను టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్ర సచివాలయంలో రాజయ్యతో పాటు కమిషన్ సభ్యులు సుంకేపల్లి సుధీర్‌రెడ్డి, మాలోత్ నెహ్రూ నాయక్‌లను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పని చేసిన వారిని అధిష్టానం గుర్తించి పదవులను అప్పగిస్తుందని భూపతిరెడ్డి అన్నారు.

ఇన్‌స్పెక్టర్‌కు ఘనంగా వీడ్కోలు



కుత్బుల్లాపూర్: బదిలీపై వెళ్తున్న పేట్ బషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్‌ కు ఘన వీడ్కోలు పలికారు. గత రెండు సంవత్సరాలుగా అందరితో కలివిడిగా ఉండే ప్రశాంత్ రాజేంద్రనగర్ ట్రాఫిక్ పీఎస్‌కు బదిలీపై వెళ్తున్న నేపథ్యంలో సోమవారం ఉదయం పోలీస్ ఉద్యోగులు అంతా కలిసి ఆయనకు పూలు చల్లి వీడ్కోలు పలకడం అందర్ని ఆకట్టుకుంది. కొంతమంది పోలీస్ సిబ్బంది కంటతడి పెట్టుకోగా మరికొంత మంది సిబ్బంది ఆయనను ఆప్యాయంగా కౌగిలించుకొని తమ ప్రేమను వ్యక్తం చేశారు.

ఓపెన్ జిమ్.. అధ్వానం

జగద్గిరిగుట్ట: జీహెచ్ఎంసీ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఓపెన్ జిమ్‌ల పరిస్థితి అధ్వానంగా తయారైంది. రెండు సంవత్సరాల క్రితం ఒక్కో డివిజన్‌కు సుమారు రూ.11 లక్షలతో ఈ ఓపెన్ జిమ్ ప్రారంభించారు. కాని వాటి నిర్వహణ మాత్రం అంతంత మాత్రంగానే ఉండడం ఇక్కడికి వచ్చేవారి సంఖ్య రోజురోజుకూ తగ్గింది. పిల్లలు ఏడిస్తే కూర్చోబెట్టడానికి ఈ పనిముట్లు ఉపయోగించుకుంటున్నారు.

బాధ్యతల స్వీకరణ



సీఐగా బాధ్యతలు చేపట్టిన కోటా విజయవర్ధన్

కుత్బుల్లాపూర్: పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్ఓగా సోమవారం కోటా విజయవర్ధన్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సీఐగా పని చేస్తున్న ప్రశాంత్ బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో మాదాపూర్ ఎస్ఓటీలో పని చేస్తున్న విజయవర్ధన్‌ను సీఐగా నియమించారు. ఈ సందర్భంగా సాక్షితో ఆయన మాట్లాడుతూ పీఎస్ పరిధిలో శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా సిబ్బందిని అప్రమత్త చేస్తానని, ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా స్థానికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



కొంపల్లి మల్టీపర్పస్ ఫంక్షన్ హాలులో ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కుత్బుల్లాపూర్: భారత రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును ప్రతి ఓటరు సద్వినియోగం చేసుకోవాలని స్వీప్ యాక్టివిటీస్ డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ లత అన్నారు. సోమవారం కొంపల్లి మల్టీపర్పస్ కమ్యూనిటీ హాలులో ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లకు పలు సూచనలు చేశారు. ఓటు హక్కును దుర్వినియోగం చేయరాదని, రాజకీయ పార్టీల ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిష్పక్షపాతంగా ఓటు వేయాలన్నారు. మెప్మా కో.ఆర్డినేటర్ .పద్మావతి, శివ శివానీ కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, రిసోర్స్ పర్సన్లు, డ్వాక్రా గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

ముమ్మరంగా గుర్రపుడెక్క తొలగింపు పనులు

సుభాష్‌నగర్: జీడిమెట్ల డివిజన్ వెన్నెలగడ్డలోని ఎన్నా చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్క తొలగింపు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పెద్ద సంఖ్యలో సిబ్బంది పాల్గొని ప్రత్యేక యంత్రం సహాయంతో గుర్రపు డెక్కను తొలగిస్తున్నారు. గతంలో స్వచ్ఛమైన జలాలతో కళకళలాడిన ఎన్నా చెరువుకు గుర్రపు డెక్క తొలగింపుతో పూర్వవైభం రానుంది.



వెన్నెలగడ్డలోని ఎన్నా చెరువులో గుర్రపు డెక్కను తొలగిస్తున్న సిబ్బంది

బస్ హెల్‌టర్



రెండేళ్లుగా ఇది గాంధీనగర్ బస్‌షెల్టర్ దుస్థితి

రంగారెడ్డినగర్: ఆర్టీసీ ప్రయాణికులకు బస్ షెల్టర్లలో సదుపాయాలు కొరవడటంతో ఇబ్బందులు పడుతున్నారు.. కేవలం బస్‌షెల్టర్లపై ఏర్పాటు చేసే ఫ్లెక్సీల ప్రకటనలపై దృష్టి సారిస్తున్న అధికారుల ప్రయాణికుల సంక్షేమాన్ని గాలికొదిలేస్తున్నారు.. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలోని పలు బస్టాప్‌ల వద్ద నగరంలోని పలు ప్రాంతాలకు వెళ్లేందుకు వేచి చూసే ప్రయాణికులకు నిలువ నీడ కరువవుతోంది.. కొన్ని బస్ షెల్టర్లలో పైకప్పు రేకులు ధ్వంసమై ఎప్పుడు కూలుతాయోనని ప్రయాణికులు భయభ్రాంతులకు గురవుతుండగా, మరి కొన్ని బస్టాప్‌లలో కూర్చోవడానికి బెంచీలు ఉండటం లేదు.. ఒకవేళ ఉన్నా విరిగిపోయి, రాడ్ మాత్రమే ఉండటంతో ముఖ్యంగా వృద్ధులు, మహిళా ప్రయాణికులకు కష్టాలు తప్పడం లేదు.. ప్రయాణికులకు సదుపాయాలు కల్పించడంలో అటు ఆర్టీసీ, ఇటు జీహెచ్ఎంసీ అధికారులు సమన్వయంతో పని చేయాల్సి ఉండగా ఆ దిశగా చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కనిపించడం లేదు. బస్టాప్‌లను మెరుగుపర్చాల్సిన జీహెచ్ఎంసీ అధికారులు అవసరమున్న చోట పట్టించుకోకుండా బస్టాప్‌లు లేని ప్రాంతాల్లో బస్ షెల్టర్లను నిర్మించి ప్రకటలనపై వచ్చే ఆదాయంపై దృష్టి సారిస్తున్నారే తప్ప ప్రయాణికుల గురించి పట్టుంచుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



జీడిమెట్ల పీఎస్ వద్ద బస్‌షెల్టర్‌లో కూర్చోవడానికి బెంచీలు లేక ఇలా..



షాపూర్‌నగర్ చౌరస్తాలో బస్‌షెల్టర్ రేకులు ధ్వంసమైన దృశ్యం



గణేషనగర్ బస్టాప్‌లో బెంచీ మాయమై రాడ్డు మాత్రమే ఇలా మిగిలింది



రంగారెడ్డినగర్ బస్‌షెల్టర్ కూల్చివేయగా ప్రస్తుతం ఆ ప్రాంతంలో వెలిసిన డబ్బాలు..

ప్రజా సంక్షేమానికి కృషి



కొలన్ హన్మంతరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఆల్విన్ మాజీ ఉద్యోగులు

నిజాంపేట్: ప్రజా సంక్షేమమే పరమావధిగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. ప్రగతినగర్‌కు చెందిన ఆల్విన్ మాజీ ఉద్యోగులు సోమవారం బాచుపల్లిలోని కార్యాలయంలో హన్మంతరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అధికంగా వస్తున్న నీటి బిల్లులు, లీకేజీల విషయమై ఆయనకు వివరించగా జలమండలి ఎండీతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ సమస్యలను గాలికి వదిలేసిందని, తమ ప్రభుత్వం ఎప్పటికప్పుడు వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటోందన్నారు.

దేశప్రజలకు మేలు చేస్తున్న ఇన్‌కాయిస్



ప్రగతినగర్‌లోని ఇన్‌కాయిస్‌ను సందర్శించిన బీజేపీ నాయకుడు మల్లారెడ్డి తదితరులు

నిజాంపేట్: సముద్ర వాతావరణంలో చోటుచేసుకునే మార్పులు, ఏర్పడే అల్పపీడనాలు తదితర సమాచారాన్ని ఎప్పటికప్పుడు చేరవేస్తూ ఇన్‌కాయిస్ దేశ ప్రజలకు ఎంతో మేలు చేస్తోందని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి అన్నారు. సోమవారం ప్రగతినగర్‌లోని ఇన్‌కాయిస్ కేంద్రాన్ని ఆయన బీజేపీ నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఇన్‌కాయిస్ డైరెక్టర్ శ్రీనివాసకుమార్, సైంటిస్టులు ఇన్‌కాయిస్‌లో రోజువారి జరిగే పరిశోధనలు, సముద్రాల్లో చోటు చేసుకునే వాతావరణ మార్పులు, భూమిపై దాని ప్రభావం వంటి విషయాలను వివరించారు. ఎలీప్ పారిశ్రామికవాడ నుండి వెలువడుతున్న డ్రైనేజీ నీటి విషయాన్ని డైరెక్టర్ శ్రీనివాసకుమార్ ఈ సందర్భంగా ప్రస్తావించగా సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేలా చూస్తానని మల్లారెడ్డి హామీ ఇచ్చారు. బీజేపీ నాయకులు బక్క శంకర్‌రెడ్డి, శ్యామ్‌రావు, విఘ్నేష్, ప్రొఫెసర్ చంద్రమౌళి, అమలేశ్వరి, మల్లేష్‌యాదవ్, కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

చందానగర్ సర్కిల్ ఉపకమిషనర్ వంశీకృష్ణ



సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న డీసీ వంశీకృష్ణ, ఎస్‌డబ్ల్యూఎం డీసీ వేణుగోపాల్‌రెడ్డి

హఫీజ్‌పేట్: పారిశుద్ధ్య కార్మికుల హాజరులో నిర్లక్ష్యం వహిస్తే తక్షణమే ఉద్యోగం నుంచి తొలగిస్తామని చందానగర్ సర్కిల్ ఉపకమిషనర్ వంశీకృష్ణ పేర్కొన్నారు. సోమవారం చందానగర్ సర్కిల్ 21 కార్యాలయంలో ఎస్ఎఫ్ఏ, ఎస్ఆర్‌పీలతో ఎస్‌డబ్ల్యూఎం డీసీ వేణుగోపాల్ రెడ్డి, డీసీ వంశీకృష్ణ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని పారిశుద్ధ్య కార్మికుల హాజరు పట్టికలో ఎలాంటి అవకతవకలు జరిగినా సంబంధిత ఎస్ఎఫ్ఏ, ఎస్ఆర్‌పిలదే బాధ్యత అని వెంటనే విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. రోడ్లపై, ఖాళీ స్థలాలలో చెత్త, భవన నిర్మాణ వ్యర్థాలు కనబడితే చర్యలు తప్పవన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఖాళీ ప్రదేశాలలో చెత్త వేయకుండా బస్తీ, కాలనీలలో అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఏఎంహెచ్ఓ డాక్టర్ కార్తీక్, శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్, 21 ఎస్ఎఫ్ఏలు, 6 ఎస్ఆర్‌పీలు పాల్గొన్నారు.

సుస్థిర భవిష్యత్తు కోసం సైన్స్

'మనూ' వీసీ ప్రొ. ఐనుల్‌హసన్

రాయదుర్గం: సుస్థిర భవిష్యత్తు కోసం సైన్స్ అని మనూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ సైన్స్ ఆధ్వర్యంలో మొదటి అంతర్జాతీయ ఉర్దూ సైన్స్ కాన్ఫరెన్స్–2024 సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుస్థిర భవిష్యత్తు కోసం సైన్స్ అనే అంశంపై ప్రారంభ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేడు కృత్రిమ మేధస్సు కీలకపాత్ర పోషిస్తుందన్నారు. హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు మాట్లాడుతూ మానవ శరీరం ప్రతికూల పరిచయ వ్యవస్థగా అభివృద్ధి చెందుతోందన్నారు. హైదరాబాద్‌లోని బిట్స్‌పిలానీ సీనియర్ ప్రొఫెసర్ అహ్మద్ కమల్ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీలో ఔషధాల తయారీ గురించి వివరించారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ సల్మాన్ ఆహ్మద్‌ఖాన్, డాక్టర్‌సలావుద్దీన్ సయ్యద్, డాక్టర్ మాజిద్ అలీ చౌదరి ప్రసంగించారు. ఈ సందర్భంగా సదస్సులో వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు 150 సైన్స్ ఎగ్జిబిట్లను ప్రదర్శించారు.



సదస్సులో పాల్గొన్న వీసీ ఐనుల్‌హసన్, హెచ్‌సీయూ వీసీ ప్రొ. బీజే రావు, ప్రొఫెసర్లు

ఘనంగా మహిళా దినోత్సవం

రంగారెడ్డినగర్: అంతర్జాతీయ మహిళ దినోత్సవంలో భాగంగా సోమవారం షాపూర్‌నగర్‌లోని శారదా విద్యా భవన్ హైస్కూల్‌లో లైఫ్ స్పాన్ అసుపత్రి ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరైన సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ శృతి మాట్లాడుతూ మహిళలు మంచి ఆహారాన్ని సమయానికి తీసుకోవాలని, అదే విధంగా మానసికంగా ధృడంగా ఉంటే ఎలాంటి అనారోగ్య సమస్యలు దరి చేరవన్నారు. ఉచిత వైద్య శిబిరంలో సుమారు 200 మంది మహిళలకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పాఠశాల కరస్పాండెంట్ భూపాల్‌రెడ్డి, లైఫ్‌స్పాన్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సురేష్, సామజిక వేత్త మధుబాబు చికిలే, హెలింగ్ హార్ట్స్ సొసైటీ అధ్యక్షుడు తూటే విజయ్ కుమార్,విద్యార్థులు, వారి తల్లులు పాల్గొన్నారు.

నాలా కల్వర్టు పనుల పరిశీలన

హఫీజ్‌పేట్: చందానగర్ డివిజన్ పరిధిలోని కైలాష్‌నగర్ వద్ద జరుగుతున్న నాలా కల్వర్టు పనులను స్థానిక కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుమారు రూ.1.60 లక్షలతో కల్వర్టు పనులు చేపడుతున్నామన్నారు. అమీన్‌పూర్‌కు వెళ్లాలంటే ట్రాఫిక్‌తో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కల్వర్టు పూర్తయితే సమస్య పరిష్కారం అవుతుందన్నారు.

ఆకట్టుకునేలా చేనేత ఉత్పత్తులు

సందడి చేసిన నటీనటులు



సాక్షి,సిటీబ్యూరో: కూకట్‌పల్లిలోని ఐశ్వర్య సిల్క్స్ 3వ వార్షికోత్సవంలో ప్రముఖ నటుడు, 'ఆట'ఫేమ్ సందీప్ ఆయన సతీమణి జ్యోతి రాజ్, యార్ జాను తదితరులు పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా ఐశ్వర్య సిల్క్స్ ఎండీ లక్ష్మి మాట్లాడుతూ.. తాను వీవర్స్ సామాజిక వర్గం నుంచి వచ్చిన మహిళనని అన్నారు. తన తొలి ప్రాధాన్యం చేనేత ఉత్పత్తులపైనే ఉంటుందన్నారు. నేతన్నలను ప్రోత్సహించేలా దేశవ్యాప్తంగా చేనేత ఉత్పత్తులను ప్రజలకు చేరువ చేస్తున్నామని పేర్కొన్నారు. నేటి యువతకు తగిన డిజైన్‌లలో తమ ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నగరంలో మరిన్ని బ్రాంచ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా నటీ, నటులు డిజైనరీ చేనేత వస్త్రాలను ధరించి ఆకట్టుకున్నారు.

'మాకూ నియామక పత్రాలు ఇవ్వాలి'

పంజగుట్ట: గురుకుల నియామకాల్లో సెలెక్ట్ అయిన బీటెక్, బీఈడీ అభ్యర్థులకు నియామక పత్రాలు ఇవ్వాలని అభ్యర్థులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అభ్యర్థులు రాఘవేంద్ర, నవనీత, అపర్ణ, శివాని, వినిత మాట్లాడుతూ... 2014 నుంచి ప్రభుత్వమే బీటెక్ చదివిన వారికి బీఈడీ చేసే అవకాశం కల్పించిందన్నారు. తాము బీటెక్, బీఈడీ పూర్తిచేసిన అభ్యర్థులమని ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన గురుకుల ఉపాధ్యాయుల 9200 పోస్టులకు తాము కూడా దరఖాస్తు చేసుకున్నామని, గురుకుల బోర్డు వారు నిర్వహించిన పరీక్షలు రాశామని తాము అదరం టాప్ 100లో వచ్చామని, ఉద్యోగాల్లో సెలెక్ట్ కూడా అయ్యామని తెలిపారు. అయితే సోమవారం ఎల్‌బీ స్టేడియంలో ముఖ్యమంత్రి చేతులమీదుగా ఇచ్చే అపాయింట్‌మెంట్ ఆర్డర్లలో తమ 97 మంది పేర్లు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవచూపి తమకు కూడా అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ కొలువులో సైన్స్ కళాశాల విద్యార్థులు

బంజారాహిల్స్: సైఫాబాద్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్‌లో విద్యాభ్యాసం చేసి 40 మంది విద్యార్థులు ప్రభుత్వ కొలువులను సాధించారు. వీరు పలు విభాగాల్లో సెలెక్ట్ కావడంపై కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ లక్ష్మణ్‌నాయక్ సంతోషం వ్యక్తం చేశారు.

వీధి వ్యాపారులను తొలగించడం అన్యాయం



కమిషనర్ రామకృష్ణరావుకు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

నిజాంపేట్: చిరు వ్యాపారుల డబ్బాలను తొలగించాలని కౌన్సిల్‌లో తీర్మానం దుర్మార్గమైన చర్య అని సీఐటీయూ జిల్లా నాయకుడు చంద్రశేఖర్ అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి ప్రగతినగర్ కమాన్ వద్ద మెయిన్ రోడ్డుకు ఆనుకుని ఉన్న ఉన్న చిరు వ్యాపారుల డబ్బాలను తొలగించడం అన్యాయమని పేర్కొంటూ సోమవారం సీఐటీయూ బాచుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కమిషనర్ రామకృష్ణరావును కలిసి వినతి ప్రతం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయు నాయకులు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా పలువురు బైక్ సర్వీసింగ్ సెంటర్, టీ సెంటర్స్, టిఫిన్ సెంటర్లు, అల్పాహారం హోటల్స్ నడుపుకుంటూ జీవనోపాధి పొందుతున్నారని, కొంత మంది చేసిన ఫిర్యాదులతో వీధి వ్యాపారులపై చర్యలు చేపట్టడం సరైంది కాదన్నారు. మున్సిపల్ కమిషనర్ చిరు వ్యాపారుల సమస్యలను సత్వరమే పరిష్కరించేలా అవసరమైతే కార్పొరేషన్ పరిధిలో అన్ని ప్రాంతాల్లో చిరు వ్యాపారులకు సామూహిక వ్యాపార కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

స్థానిక సమస్యలపై అధికారులకు ఫిర్యాదు



కుత్బుల్లాపూర్ సర్కిల్ ఉప కమిషనర్ నరసింహకు వినతి పత్రం అందజేస్తున్న సుదర్శన్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో సోమవారం జరిగిన ప్రజావాణిలో స్థానికంగా నెలకొన్న సమస్యలపై ఆయా సంక్షేమ సంఘాల ప్రతినిధులు అధికారులకు ఫిర్యాదులు అందజేశారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో 9 ఫిర్యాదులు, గాజులరామారం సర్కిల్ పరిధిలో 11 మొత్తం 20 ఫిర్యాదులు అందాయని ఉప కమిషనర్లు నరసింహ, మల్లయ్యలు పేర్కొన్నారు. జీడిమెట్ల డివిజన్ యాదిరెడ్డిబండలోని ప్రతి వర్షాకాలంలో డ్రైనేజీ నాలాలు నుండి వీధుల్లో మురుగునీరు చేరడంతో దోమలతో ఇబ్బందులు పడుతున్నారని, ఈ దఫా ఇబ్బందులు తలెత్తకుండా డ్రైనేజీ వ్యవస్థను పటిష్టం యేయాలని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కందాడి సుదర్శన్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు. జగద్గిరిగుట్ట లాస్ట్‌బస్టాప్ ప్రాంతంలోని ఇందిరమ్మ విగ్రహం సమీపంలో రోడ్డుకు ఇరువైపులా అక్రమణలకు గురైందని, దీంతో తీవ్ర ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందని సీపీఐ రాష్ట్ర నాయకుడు ఏసురత్నం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ రద్దీతో గతంలా విధుల్లో ఉన్న మహిళా కానిస్టేబుల్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిందని, ఇప్పటికైనా అధికారులు రోడ్ల అక్రమణలను తొలగించి వాహనాలు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సోమశిల సబ్‌స్టేషన్‌లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు



సోమశిల సబ్‌స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలిస్తున్న విద్యుత్ అధికారులు

భాగ్యనగర్‌కాలనీ: వేసవికాలం యాక్షన్ ప్లాన్‌లో భాగంగా కూకట్‌పల్లిలోని సోమశిల సబ్‌స్టేషన్‌లో పాత ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. సోమవారం ఈ ట్రాన్స్‌ఫార్మర్లను సీజీఎం ఇంజినీర్ సాయిబాబా, ఎస్ఈ డీఎస్ మోహన్ ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎండాకాలం నేపథ్యంలో విద్యుత్ వినియోగం పెరింగిందని అందుకే 12.5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ ఆపరేషన్ కూకట్‌పల్లి చక్రవర్తి, ఏఈఈ, కూకట్‌పల్లి ప్రసాద్, భక్తవత్సల్‌రెడ్డి, అశోక్, ఏఈ శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ విద్యార్థినికి రెండు కాంస్య పతకాలు

బాలానగర్: ఖమ్మం జిల్లాకు చెందిన పవిత్ర జేఎన్‌టీయూ సుల్తాన్‌పూర్ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో పాడగంటి పవిత్రచారి మొదటి సంవత్సరం చదువుతోంది. జమ్మూ యూనివర్సిటీలో ఫిబ్రవరి 13 నుంచి 18వరకు జరిగిన చైనీస్ మార్షల్ ఆర్ట్స్ ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో ఆమె కాంస్య పతకం సాధించారు. అదే విధంగా జార్ఖండ్‌లో ఫిబ్రవరి 21 నుంచి 27 వరకు జరిగిన ఫెడరేషన్ కప్పు పోటీల్లో కాంస్య పతకం సాధించి మంచి ప్రతిభ కనబరిచారు. సోమవారం జేఎన్‌టీయూ వీసీ డా. కట్టా నరసింహారెడ్డిని ఆమె మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా పవిత్రచారిని వీసీ, ప్రొఫెసర్లు సత్కరించి అభినందించారు. పవిత్రచారిని యూనివర్సిటీకి చెందిన కళాశాలల విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని జేఎన్‌టీయూకు మంచి పేరు తీసుకురావాలన్నారు. పవిత్రకు శిక్షణ ఇచ్చిన డా. దిలీప్‌ను, డా.అశోక్‌ను అభినందించారు.

దేశం గర్వించేలా యువత తయారవ్వాలి

సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్



మాట్లాడుతున్న రత్నాకర్

గచ్చిబౌలి: దేశం గర్వించేలా యువత తమ జీవితాలను తీర్చిదిద్దుకోవాలని సత్యసాయిసెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో సత్యసాయి సేవా సంస్థ హైదరాబాద్ జిల్లా ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో రత్నాకర్ మాట్లాడుతూ భారతదేశంలో ఉన్న ప్రేమ, దయ గుణాలు ప్రపంచంలో ఎక్కడా కనిపించవన్నారు. సత్యసాయి బాబా బోధించిన విధంగా మన జీవితాలకు మనమే బాధ్యులమని గ్రహించి ముందుకు సాగాలన్నారు. అభివృద్ధిలో దూసుకుపోతున్నా దేశంలో వృద్ధాశ్రమాలు పెరిగిపోవడం ఆవేదన కలిగిస్తోందన్నారు. ప్రపంచానికి మనల్ని పరిచయం చేసిన తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవాలని వారిని విస్మరించరాదన్నారు. గ్రామసేవే రామ్‌సేవ అని సమాజసేవ కార్యక్రమంలో పాల్గొంటూ దేశ అభివృద్ధికి దోహదపడాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎం యూఎస్ ఇండియా సీనియర్ డైరెక్టర్ రమేష్ కున్నట్, సలహాదారులు యూఎస్ కాన్సులేట్ అనిత లహరి, సత్యసాయి సేవా సంస్థ తెలంగాణ శాఖ అధ్యక్షుడు వెంకట్‌రావు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మల్లేశ్వరరావు 60 కళాశాలలకు చెందిన 6వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు.